క్లుప్తంగా

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : ప్రతి ఒక్కరూ తమ తమ రంగా ల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాక దళితవాడలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి ముగ్గుల పోటీల విజేతలకు ఆయన మంగళవారం రాత్రి బహుమతులు అందజేశారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా తమలో ఉన్న కళను నిరూపించుకోవాలన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయు డు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కాశీబాబు, దళిత నేతలు బుజ్జిబాబు, పిల్లి అప్పారావు, అప్పలనాయుడు, శివ కార్యక్రమంలో పాల్గొన్నారు.

లెప్రసీ సర్వే వేగవంతం చేయాలి



మునగపాక పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా టీబీ అధికారి కిషోర్‌కుమార్

మునగపాక : మునగపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా టీబీ, హెచ్ఐవీ అధికారి డాక్టర్ కిషోర్‌కుమార్ సందర్శించారు. స్థానికంగా అందుతున్న సేవలు అలాగే పరీక్షలు, మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అన్ని జాతీయ కార్యక్రమాలు శతశాతం అమలు చేయాలన్నారు. లెప్రసీ సర్వే వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామం లో జరుగుతున్న లెప్రసీ సర్వే తీరును పరిశీలించారు. సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమామహేష్, ఏఎన్ఎం దేవకి, పీహెచ్‌సీ సిబ్బంది రాజేశ్వరి, తులసీ, శిరీషా, జగన్నాథరావు, మారిశెట్టి లక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

మునగపాక : మండల స్థాయి కబడ్డీ పోటీలు గురువారం పాటిపల్లి సచివాలయ పరిధిలో ప్రారంభమవుతాయని ఎంపీడీవో ఎం.మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా సచివాలయాల పరిధిలో ప్రతిభ చూపించిన క్రీడాకారుల కోసం మండల స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయోధ్యరాముని అక్షింతల పంపిణీ



కుమారపురంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : కుమారపురం గ్రామంలో అయోధ్యరాముని అక్షింతలు పంపిణీ చేస్తున్నట్టు సమరసత ఫౌండేషన్ ప్రతినిధి నీలాపు వెంకటరెడ్డి అన్నారు. అయోధ్య నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలు కుమారపురం, పెద్దేరు రత్నయ్యపేట గ్రామాల్లో పంపిణీ చేసినట్టు చెప్పారు. అదేవిధంగా ఈనెల 22న అయోధ్య గర్భగుడిలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా కాషాయి జెండాను ప్రతి ఇంటి పైన ఎగుర వేయాలని సూచించారు.

సీఏ ఉత్తీర్ణత సాధించిన మత్స్యకార యువకుడికి సత్కారం



నాగరాజు కుటుంబాన్ని సత్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : పూడిమడకలో నిరుపేద కుటుంబంలో జన్మించి ఇటీవల విడుదలైన చార్టెడ్ అకౌంటెంట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన యువకుడ్ని స్థానికులు సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని సత్కరించారు. మంగళవారం పూడిమడకలో ఎరిపల్లి నాగరాజును మత్స్యకార సంఘం నేతలు సత్కరించారు. నాగరాజుని ఆదర్శంగా తీసుకోవాలని ఒరుపుల జైశంకర్ ఈ సందర్భంగా స్థానిక యువతకు పిలుపునిచ్చారు.



నా పేరు టీమిశెట్టి రత్నం, మాది తిమ్మరాజుపేట గ్రామం. భవానీ స్వయ సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. మా సంఘ సభ్యులంతా కలిసి బ్యాంకు ద్వారా రూ.5,47,201 రుణం తీసుకున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా తాము తీసుకున్న రుణం నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. విడతకు రూ.13680 వంతున ఇప్పటికే మూడు విడతలకు రూ.41040 మాకు జమ అయింది. మిగిలిన రూ.13,680 నగదు ఈ నెలాఖరున జమ అవుతుందని తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాం.



నాపేరు మళ్ల మణి, మాది మునగపాక గ్రామం. నేను సాంబశివ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నాను. మా గ్రూపు సభ్యులమైన పదిమంది కలిసి కుటుంబ అవసరాలకు గాను బ్యాంక్ నుంచి రూ.7,50,000 మేర రుణం తీసుకున్నాం. గ్రూపు మొత్తానికి వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.6,70,288 నగదు చెల్లించాల్సి ఉంది. అయితే ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాన్ని నాలుగు విడతలుగా బ్యాంక్‌లో నగదు జమ చేస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. హామీలో భాగంగా మూడు విడతలకు గాను రూ.40271 నగదు బ్యాంక్‌లో జమ చేశారు. మిగిలిన విడతకు సంబంధించి ఈ నెలాఖరున రూ.16752 నగదు జమ చేస్తామన్నారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది.



వైఎస్సార్ ఆసరా పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



అక్కచెల్లెమ్మలకు జగనన్న ఆసరా...

- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఇప్పటికే మూడు విడతలుగా వాయిదాలు చెల్లింపు
- ఈ నెల 23 నుంచి 30 వరకు నాలుగో విడత చెల్లింపుకు చర్యలు
- 1262 సంఘాలకు రూ.41కోట్ల మేర రుణమాఫీ

మండలం-మునగపాక	
సచివాలయాలు	21
పంచాయతీలు	26
డ్వాకా సంఘాలు	1262
సంఘ సభ్యులు	13706
మండల పరిధిలోని లబ్ధిరూ.	41 కోట్లు

మునగపాక : మహిళా సాధికారితే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు అండగా నిలిచారు. మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా చెల్లించేందుకు ఇచ్చిన హామీ పూర్తి స్థాయిలో అమలు కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. 2019 ఏప్రిల్ 19కు ముందు తీసుకున్న రుణాలను తాము అధికారంలోకి వస్తే నాలుగు విడతలుగా రుణమాఫీ చేస్తామని చెప్పి ఇచ్చిన హామీని నిజం చేశారు. ఇప్పటికే మూడు వాయిదాలు చెల్లించిన ప్రభుత్వం ఈ నెల 23 నుంచి 30 వరకు నాలుగోవ వాయిదా చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

1262 సంఘాలు....రూ.41 కోట్ల రుణమాఫీ

మండల వ్యాప్తంగా 1262 సంఘాలున్నాయి. 13706 మంది సభ్యులు సంఘాల్లో ఉన్నారు. నాలుగు విడతలుగా ప్రభుత్వం రూ.41 కోట్లపై పైగా రుణమాఫీ చేస్తుంది. ఇప్పటికే మూడు విడతలుగా ఏడాదికి రూ.10 కోట్ల వంతున మూడు విడతలకు గాను రూ.30 కోట్లకు పైగా రుణమాఫీ చేసింది. మిగిలిన విడత ఈనెలాఖరు నుంచి రుణమాఫీ కానుంది.

సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలు

మండల వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా పథకానికి అర్హుల జాబితాలు ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రభుత్వం ద్వారా ఇంతవరకు ఆసరా ఎంతమేర జమ అయింది, అలాగే మిగిలిన వాయిదాకు సంబంధించి ఎంతమేర రుణమాఫీ అవుతుందనే విషయాలపై సంఘ సభ్యులకు వెలుగు అధికారులు, సీసీలు అవగాహన కల్పించారు.



డ్వాక్రా మహిళలతో వెలుగు సిబ్బంది

అందుబాటులో జాబితా



అర్హులైన ప్రతి మహిళకు వైఎస్సార్ ఆసరా పథకం అండగా నిలుస్తోంది. ఎన్నికల ముందు సంఘ సభ్యులకు ఇచ్చిన హామీలో భాగంగా ఇప్పటికే మూడు విడతలుగా బ్యాంక్‌ల్లో నగదు జమ చేశారు. ఈ నెల 23 నుంచి 30లోగా నాలుగో విడత చెల్లింపులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.ఇప్పటికే నాలుగో విడతకు సంబంధించి అర్హుల జాబితాలను సచివాలయాల్లో అందుబాటులో ఉంచాం.

– కొండమ్మ, వెలుగు ఏపీఎం, మునగపాక మండలం

సీఎం మహిళా పక్షపాతి



మహిళా పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారు. మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలు తీసుకున్న రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేసేందుకు అవసరమయ్యే చర్యలు తీసుకున్నారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– మద్దాల ధనలక్ష్మి, సర్పంచ్, సిరసపల్లి

సందడిగా తీర్థ మహోత్సవాలు



సైతారుపేట తీర్థంలో రంగులరాట్నం



పోటీల్లో మహిళలు వేసిన ముగ్గులు



సైతారుపేట వీధుల్లో భజన చెట్టు ఊరేగింపు

ఎస్.రాయవరం : సంక్రాంతి వేడుకలు పురస్కరించుకుని గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సైతారుపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన తీర్థంతో సందడి వాతావరణం నెలకొంది. తీర్థం చూసేందుకు పరిసర గ్రామాలు సర్వసిద్ధి, పేటసూదిపురం, జేవీపాలెం, వేమగిరి తదితర గ్రామాల వారు సైతారుపేట చేరుకుని సందడి చేశారు. తీర్థంలో ఆట వస్తువుల వద్ద చిన్నారులు కేరింతలు కొట్టారు. యువత రంగుల రాట్నాలు ఎక్కి ఉత్సాహం ప్రదర్శించారు. ఉత్సవ కమిటీ సభ్యులు రామాలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

పైడితల్లమ్మ తీర్థం నేడు

రాంబిల్లి : మామిడివాడలో పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో ప్రసిద్ధి చెందిన పైడితల్లమ్మ తీర్థ మహోత్సవానికి పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు

మునగపాక: గ్రామాలాభివృద్ధిపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ పి.వెంకటలక్ష్మి కోరారు. మునగపాక మండల పరిషత్ హాలులో బుధవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామాలాభివృద్ధి ప్రణాళికలపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో సమస్యలు దశలవారీగా పరిష్కరించేలా చూడాలన్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు.

టీడీపీకి తెలుగు యువత అధ్యక్షుడు రాజీనామా



రాంబాబు

నక్కపల్లి : తెలుగుదేశం పార్టీకి, మండల తెలుగు యువత అధ్యక్ష పదవికి పిక్కి రాంబాబు రాజీనామా చేశారు. మండలంలో రాజయ్యపేట గ్రామానికి చెందిన మత్స్యకార నాయకుడిగా ఉంటున్న రాంబాబు దాదాపు రెండు దశాబ్దాల నుంచి తెలుగు దేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన మండల తెలుగు యువత అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. వ్యక్తిగత కారణాలతో ఆయన మండల తెలుగు యువత అధ్యక్ష పదవికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు బుధవారం తెలిపారు. ఇన్నాళ్లు పార్టీకి సేవ చేసే భాగ్యం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. కేవలం వ్యక్తిగత కారణాలతోనే పార్టీకి, పదవులకు రాజీనామా చేస్తున్నానన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



గంపల నూకరాజు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : పెదరాంభద్రపురం గ్రామంలో ఈనెల 11న ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో మృతి చెందిన గంపల నూకరాజు కుటుంబాన్ని ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు బుధవారం పరామర్శించారు. మృతుడి భార్యపిల్లలను ఓదార్చారు. నూకరాజు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతి, తాతారావు, ఎంపీటీసీ గారా వెంకటలక్ష్మి ,చక్రవర్తి, సర్పంచ్ గంపల మార్త సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో వైద్యం మరింత చేరువ

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి
- తెరువుపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



వైద్యశిబిరాన్ని సందర్శించిన మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ కొండలరావు

యలమంచిలి : పేదల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ తెరువుపల్లి సచివాలయం పరిధి లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావుతో కలసి సందర్శించారు. ఆరోగ్య శిబిరంలో ప్రజలకు ఇస్తున్న ముందులను పరిశీలించి వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. గతంలో జరిగిన వైద్య శిబిరంలో ప్రభుత్వం అందజేసిన మందులు పనిచేస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మందు లు పనిచేస్తున్నాయని, ప్రభుత్వం నేరుగా గ్రామా ల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందుతున్నామని పలువురు తెలిపారు. ఒకప్పుడు దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వైద్య సేవలు అందేవి కావని ప్రస్తుత ప్రభుత్వంలో మలి విడతలో ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య వివరాలు ఆరోగ్య యాప్ ద్వారా తెలుసుకుని వారికి అన్ని విధాలుగా ఆరోగ్యభరోసాను అందిస్తుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కూడా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, వైద్యసిబ్బంది, వలంటీర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



గణపర్తి హైస్కూల్లో పూర్వ విద్యార్థులు



దిమిలి ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మునగపాక : గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు బుధవారం సందడి చేశారు.1993–94లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సందడి చేశారు. నాడు చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం అంతా సహపంక్తి భోజనాలు చేశారు. చదరం త్రినాథ్, కొలపర్తి శివకృష్ణ, మత్తుర్తి నాగ శంకర్, కాండ్రేగుల వెంకటేశ్వరరావు , పెంటకోట శశిధర్, నాగేశ్వరరావు ఆత్మీయ కలయికకు నేతృత్వం వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

రాంబిల్లి : దిమిలి ఉన్నత పాఠశాలలో బుధవారం 2002–03 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. అప్పుడు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

ఇంటి వద్దకే ఆధునిక వైద్యసేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న జానకీరామరాజు, వెంకటరమణ

అనకాపల్లి : ఇళ్ల వద్దకే ఆధునిక వైద్యసేవలు ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు అన్నారు. విజయరామరాజుపేట సచివాలయంలో బుధవారం మలివిడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని జెడ్సీ వెంకటరమణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎన్నడూ చూడని విధంగా తమ ప్రభుత్వ హయాంలో ఖరీదైన వైద్య సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. శిబిరంలో వైద్యులు పలువురిని పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ ఎం.శ్రీను, పార్టీ శ్రేణులు పలకా సత్యనారాయణ, శ్రీనివాసరావు, వేగి త్రినాథ్, దొడ్డి హరిబాబు, మోహన్, నూకరాజు, రాంజీ, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లింగరాజుపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



లింగరాజుపాలెం గ్రామంలో ఇంటివద్ద వైద్య సేవలు అందిస్తున్న శక్తి ప్రియ

ఎస్.రాయవరం : ఇంటివద్దకే వైద్యం అందిస్తున్న సేవలను సద్వినియోగపరుచుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తి ప్రియ అన్నారు. లింగరాజుపాలెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. సచివాలయం కేంద్రం సుమారు 160 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఇంటివద్ద కదలులేని స్థితిలో ఉన్న రోగులను నేరుగా వైద్యాధికారి ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించారు.

కారు ఢీకొని తాపీమేస్త్రి మృతి



సత్తిబాబు (57)

కశింకోట : నరసింగబిల్లి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి చెందాడు. సీఐ ఎం. వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం.. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తూ నరసింగబిల్లి కూడలి వద్ద రోడ్డు దాటుతున్న మోపెడ్‌ను అదే మార్గంలో కారు వచ్చి ఢీకొంది. దీంతో మోపెడ్ నడుపుతున్న యలమంచిలి మండలం కొక్కిరాపల్లి వద్ద అగ్రహారానికి చెందిన సుందరపు సత్తిబాబు(57) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సొంత పని మీద తన గ్రామం నుంచి నరసింగబిల్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి పోస్టుమార్టంకు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందన్నారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



డీసీఎంఎస్ ఆవరణలో కబడ్డీ క్రీడలో బాలికలు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంతో పాటు డీసీఎంఎస్ ఆవరణలో బుధవారం ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీలు హోరా హోరీగా సాగాయి. డీసీఎంఎస్ ఆవరణలో బాలికలు కబడ్డీ పోటీలు నిర్వహించగా ఎన్టీఆర్ క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు జరిగాయి. క్రీడల్లో తమ సత్తా చాటుకునేందుకు క్రీడాకారులు చురుగ్గా పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి తీర్థం



తీర్థంలో చిన్నారుల సందడి

అనకాపల్లి : మార్టూరు గ్రామంలో రాములోరి తీర్థం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారి ఆలయానికి భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు సీతా సమేత శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఆలయం ముందు తీర్థం జరిగింది. తీర్థంలో రంగులరాట్నం, చిన్నారుల ఆటవస్తువులు వెలిశాయి. రంగులరాట్నం ఎక్కేందుకు చిన్నా పెద్దా క్యూకట్టారు. జంపింగ్ స్ప్రింగ్‌తో చిన్నారులు ఆటలాడుకున్నారు.

తెల్లని కొంగలు..గుంపులు గుంపులు



రామారాయుడుపాలెం సమీపంలో పంట పొలంలో కొంగల గుంపులు

యలమంచిలి రూరల్ : పొలాల్లో రైతు నేస్తాలు సందడి చేస్తున్నాయి. రైతులు రబీ సీజన్‌కు పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేసుకుంటున్న సమయంలో తెల్లటి కొంగలు గుంపులు గుంపులుగా చేరి ఆహారం కోసం అన్వేషిస్తున్నాయి. పొలంలోని పురుగులను తింటూ ఆకలిని తీర్చుకుంటున్నాయి. రామారాయుడుపాలెం, సోమలింగపాలెం, పురుషోత్తపురం తదితర గ్రామాల సమీపంలోని పంట పొలాల్లో తెల్లటి కొంగల గుంపులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.